క థ

# ఆయనింకారాలేదు

తిరుపతయ్య

క్రమంగా అలుముకుంటున్న చీకటి. నాగరికతను తాకలేక, ఆకాశాన్నందుకోలేక భూమ్యాకాశాలమధ్య నిలిచిపోయిన చీకటి. ట్యూబ్‌లైట్ల వెలుతురులో నడిచిపోతున్న జనం. నక్షత్రాలకాంతిలో నడచిపోతున్న మబ్బులు. పిచ్చుకల శబ్దం తగ్గిపోయింది. రోడ్డుమీద కలకలం హెచ్చుతోంది. మనసులో కలవరం చోటుచేసుకుంటోంది. "ఆయనింకారాలేదు"

రోడ్డు నానుకునిఉన్న డాబామీద పిట్టగోడకానుకుని కుర్చీవేసుకు కూర్చుంది శాంత. ట్యూబ్‌లైట్ల వెలుతురులో అంతదూరం ఆమెకూ, అంతదూరానికి ఆమే కనిపిస్తారు. ఆయనొస్తే అంతదూరంనుండే కనిపిస్తాడు. రోడ్డు వచ్చే పోయే వారితో రద్దీగావుంది. పరుగులు పెడుతోంది. "ఆయనింకారాలేదు".

"ఇంకా ఎందుకు రాలేదో! ఎవరన్నా స్నేహితునింటికి పోయి .... రోజూ స్నేహితునింటికే అనుకోవాలా? ఆఫీసులో పనుండి ఉన్నాడేమో! గార్డెన్‌లో కాసేపు కూర్చుని వస్తాడేమో! లైబ్రరీకి పోయి కాసేపు చదువుకునివస్తాడేమో! వస్తుంటాడు. బహుశా ఈపాటికి బయలుదేరవచ్చు"

"ఇవ్వాళ ఇష్టమని ... ఎవరికి? ఎవరి కిష్టమని? ఎవరికైతేనేమిలే! లేతాకు పచ్చచీర, దానికి సరిపోయే బ్లౌజూ వేసికుంది. తలంటిపోసికున్న వెంట్రుకలకు నూనె రాయకుండా, సగంజడవేసి వదిలేసింది. వెన్నెలకింద ఆయనతో డాబామీద పసిపచ్చికలాంటి కబుర్లాడాలనుకుంది. "ఆయనింకారాలేదు"

శాంతకు విసుగుపుడుతోంది. మెట్లు మెల్లగాదిగి గదిలోకివచ్చింది. అద్దంలో చూచుకుంటూ కాస్త పౌడరద్దింది. గుండ్రటిబొట్టు చెరిపేసి దోసగింజబొట్టు పెట్టింది. గ్లాసులో నీళ్ళమీద తేలుతున్న మల్లెమొగ్గ దండ తలలో పెట్టుకోబోయి ఆగింది. "ఆయన ..." అనుకుంటూ ముసిముసిగానవ్వి మళ్లీ గ్లాసులోవేసింది. ఆయనవస్తే ఏడ్పించి తలుపు తీయాలనుకుంది.

శాంత మళ్ళీ ఓమారు అద్దంచూచి డాబాఎక్కింది. రోడ్డు మీదకాంతికీ చీకటికీ యుద్ధం జరుగుతోంది. ఓ జంట—దాదాపు అతుక్కుపోయినట్లుగా నడుస్తున్నారు. శాంత వాళ్ళనుచూసి సంతోషించి ఈర్ష్యచెందింది. "వాళ్ళకు పరిసరాలు కనిపించడం లేదు. ఎక్కడికిపోతున్నారో? పార్కుకా? షాపింగుకా? సినిమాకా? కోవెలకా? ఎక్కడికైతేనేం? ఎక్కడికైనాపోవచ్చు అలాగనుకుస్తూ." ఓ పోకిరి డాబాక్రింది రోడ్డుమీద తలయెత్తి సన్నగా ఈలవేశాడు. శాంత అటుచూసింది. వాడు ఏమెరుగ నట్లుగా కాళ్ళు చేతు లూపుకుంటూ పోతున్నాడు. శాంత కసహ్యంవేసింది. తర్వాత చిన్నగా నవ్వుకుంటూ పైటసర్దుకుంది. "ఆయన వచ్చేజాడ కనిపించలేదు"

"అదుగో! ఆయన ఒంటరిగాపోతున్నాడు. తలవాల్చుకు నడుస్తున్నాడు విచారంగా. అతనికి భార్యవుందా? ఉంటే మరి వెంటరాలేదేం? వాళ్ళిద్దరికీ సరిపడదా? ఆమె ఈయనకి తగదా? పాపం" అతన్నిగురించి అట్లాఊహించి జాలిపడుతున్నందుకు శాంత సిగ్గుపడింది. కాసేపు ఆకాశాన్ని, కాసేపు రోడ్డునూ పరీక్షించింది. "ఆయన వచ్చేజాడ కనిపించలేదు."

చర్చిగంటలు ఎనిమిదిసార్లు మ్రోగాయి. గాలివేగం హెచ్చింది. ఎండిపోయి కూడా ఇంకా రాలిపోని దిరిసెనకాయలు పనిలేని ముసలాళ్లలా వదురుతున్నాయి. పోలీసు విజిల్ వినిపిస్తోంది. రిక్షావాడికండలు తిరిగినశరీరం, రిక్షాబెల్ మ్రోగిస్తూ ట్యూబ్‌లైట్ల కాంతిలో క్షణకాలంమెరిసింది. కాలేజికుర్రాడిలా ఉన్నాడు — కాలరెత్తి జుట్టు నుదురుమీదపడేలాదువ్వి, సిగరెట్ పీలుస్తూ, శీఘ్రగ్గానడుస్తూ, ఓ చూపువిసిరి పోతున్నాడు. శాంతకు గర్వంకలిగింది. చూపులు దించుకోకుండా ఆపేచూస్తూఉంది 'ఆయనవచ్చే జాడ కనిపించలేదు.'

"చదువుకునే రోజులు ఎంతహాయిగా గడిచాయి! మురళి సన్నగా అమ్మాయిలా ఉండేవాడు. క్లాసులో దొంగచూపులు చూసేవాడు. తనుచూస్తే తలదించుకునేవాడు

కరుణాకర్‌కు పెద్ద పర్సనాలిటీ, మీసాలున్నా అమ్మాయిలంటే తగనిభయం. మరింక కిషన్ – అంతా 'కోతి' అనేవారు. సుందరికి ప్రేమలేఖకూడా వ్రాసాడు. సుందరి ఆ ఉత్తరాన్ని ప్రిన్సిపాల్ కిచ్చింది. తనైతే....తనైతే ... ఏంచేసేది తనైతే? ఓహ్!'' శాంతకు ఓపిక తగ్గుతోంది. "ఆయన వచ్చేజాడ కనిపించలేదు.''

"ఆరోజు - రామప్ప గుళ్ళల్లోకి ఎక్స్‌కర్షన్ పోయినప్పుడు, ఆనగ్నశిల్పాలను చూస్తూ శేఖర్ తన్మయుడై అప్పుడే ఓ గేయంవ్రాసి చదివి వినిపించాడు. అతనితో మాటాడాలని తనకెంతోకోరిక. కాని అరుంధతి అతన్ని ప్రేమించి పెళ్ళికూడా చేసుకుంది. అరుంధతి నిజంగా అదృష్టవంతురాలు. అంటే తను? తనుమాత్రం? తనకేంలోటు? లంకంత ఇల్లు, ఆస్తి - యువకుడైన భర్త. తనకేంలోటు? ఏంలోటు? అబ్బా!'' శాంతకు తలనొప్పి వస్తోంది. 'ఆయన వచ్చేజాడ కనిపించలేదు.'

"ఆ లెక్కల లెక్చరర్ స్టాఫ్‌రూములో ఎవరూలేనపుడు ప్రాబ్లం అడుగుతే నోటుబుక్కందుకొంటూ మెల్లగా వ్రేళ్ళనుతాకాడు. ఇంకెక్కడి సాల్వ్! గ్రుడ్లప్పగించి తన ముఖంచూస్తూ కూర్చున్నాడు. తనానాడెంత గర్వించింది? పాపం ఆయన భార్య అనుకూలవతికాదట. ఆనాడు అతడు బిడియస్తుడు కాకపోతే? కాకపోతే? ఏమయ్యేది కాకపోతే? ఛ ఛ!'' శాంత కన్నుల్లో నీళ్ళుతిరిగాయి. 'ఆయన వచ్చే జాడ కనిపించలేదు.'

ఎదురింటి రంగనాథం ఇంట్లో తొమ్మిది గంటలు. ఆయన భార్య పుట్టింటికి పోయింది ప్రసూతికి, "అమాయకురాలు పాపం, పనిమనిషితో సరసాలూవాడూ. ఆ మంగి రంగుల చిలుకలా రంగనాథంతో సరసాలాడడం తనెన్నిసార్లు చూడలేదు? అది అతనివాళ్ళో చేరడం తన కెన్నిసార్లు కనిపించలేదు? ఛీ! ఛీ! లోకంలో నీతిలేకుండాపోతోంది. ఆ రంగనాథం తననుచూసి పళ్ళన్ని బయటపెట్టి నవ్వుతాడు కిసుక్కున. ఏమనుకున్నాడో కాని! అతడంటే తనకసహ్యం. అబ్బ! ఎంతధైర్యం! నిన్న ఇదే సమయంలో 'పొద్దుగడవడంలేదూ! రండి మాయింట్లో మాటాడుకుందాం' అంటాడావెధవ? ఎవరూ వినలేదుకాని - వింటే ఇంకేమన్నావుందా? తాను మాటాడకుంటే దగ్గరగావచ్చి చేయిపట్టుకుంటాడా? తను మెల్ల్కొని ఛీ! అంటూ చేయివిదిలిస్తే కిసుక్కున నవ్వుతాడా? వాడి పనిపట్టాలి. ఎలా? ఎలాపట్టాలి. అబ్బా!'' శాంత కణతలమీద ఎవరో సుత్తితో బాదుతున్నారు. 'ఆయనింకా అప్పుడే వచ్చేట్టులేదు.''

శాంత డాబాదిగి గదిలోకివచ్చింది. "రంగనాథం ఉన్నాడా? సినిమాకుపోయాడేమో! ఎవతె దగ్గరకన్నా పోయాడేమో! అంతపనీచేస్తాడు. అయినా భార్యకు కడుపాయె పాపం. కడుపయితే? . కడుపయితే ?" శాంత విచ్చుకుంటున్న మల్లెదండ తలలో తురుముకుని తలుపు మెల్లగాతీసింది. మూసినతలుపుకు తాళం. గబాల్న తలుపుమూసి తలుపు నానుకుని బోరున ఏడ్చింది. "ఆయన అప్పుడే వచ్చేట్టులేదు."

"ఏమయింది తనకు? ఏమవుతోంది తనకు? మనసులో శిఖరంనుండి లోయలో పడే సెలయేరు చప్పుడెందుకు? హృదయంలో అగ్నిపర్వతాలు బ్రద్దలైన శబ్దం ఎందుకు? గుండెలో సముద్రుని బడబానల జ్వాలలకీలలు ఎందుకు? ఏమయింది తనకు? ఏమవుతోంది తనకు?" శాంత ఆలోచనలు గోదావరి వరదల్లా పరుగెత్తుతున్నాయి. ఆమె గబగబావెళ్ళి మంచంమీదపడి తనివితీరా ఏడ్చింది. హృదయం చల్లబడేవరకూ కన్నీళ్ళుకార్చింది. 'ఆయన వస్తాడు. ఇవ్వాళగడచిపోకుండానేవస్తాడు. ఎందుకురాడు?'

శాంత మౌనంగా ఆలోచనల కానకట్ట కడుతోంది. కాసేపటికి మెల్లిగాలేచి అద్దందగ్గరికి పోయింది. కన్నీటి చారలున్నా ఉజ్జ్వలంగా నివురులేని నిప్పులావుంది ప్రతిబింబం. శాంత గ్లాసులోని నీళ్ళతో ముఖం తుడుచుకుంది. 'ఆయన వస్తాడు ఇవ్వాళ గడచిపోకుండానే వస్తాడు. ఎందుకురాడు?'

తలలో మల్లెమొగ్గలు విచ్చుకున్నాయి. రోడ్డుమీద అప్పుడప్పుడు కారుదూసుకుపోయిన శబ్దం. ఉండి ఉండి రిక్షాగంటలచప్పుడు. దిరిసెనపూలు మత్తును వెదజల్లుతున్నాయి. 'చదువూ, సంస్కారం; ఆస్తీ, అంతస్తు; అందమూ, వయసు ఉన్న వాసుదేవరావు భర్తకావడం అదృష్టమే కాని లోటు. తను విడమరచి చెప్పలేని లోటు. అతనిలో ఉత్సాహంలేదు. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నట్లు పరధ్యాన్నంగా ఉంటాడు పెళ్ళయిన మొదట్లో ఎవరినన్నా అంతకుముందే ప్రేమించాడేమో అనుకుంది తను. కాని అదికాదట. అదయినా బాగుండేది. అతని తరహా అంతేనట. తను బాగుచేసుకోవాలట. అత్తవారి ఇంట్లోనివాళ్ళ మాటలసారాంశం అది. దారికి వస్తాడా?"

"ఎందుకురాడు? తననుచూస్తే తప్పకుండా మారాలి. కాని .... కొన్నాళ్ళ తర్వాతనైనా అతనిలో ఉత్సాహాన్ని, ఉరకలుపరుగులతో తనను గుక్కతిప్పు

కోకుండా ముంచెత్తే ఉత్తేజాన్ని ఎందుకు చూడకూడదు! తప్పకుండాతను చూస్తుంది. అమ్మయ్య ఆయన వస్తాడు. ఇవ్వాళ గడచిపోకుండానే వస్తాడు. ఎందుకురాడు?''

"శాంతా! శాంతా!" తలుపు చప్పుడైంది. శాంతకు ప్రాణాలు లేచివచ్చాయి. వెంటనే పోయి తలుపు తీయాలనుకుంది. కాని కాసేపేడ్పించాలని ఆలస్యం చేసింది. "ఓ శాంతీ! తలుపుతీయవేమే ముద్దూ!'' అనంటే బాగుండుననుకుంది. కాని తలుపు మీది గొళ్ళెం చప్పుడే ఎక్కువైంది. శాంత నిద్రను నటిస్తూపోయి ఆవులింతలుతీస్తూ తలుపుతీసింది. అతడు లోపలికివచ్చాడు రోజులాగే. అచ్చం ప్రతిరోజులాగే వచ్చాడు.

"మా స్నేహితుడు తన భార్యతో సినిమాకుపోతూ నన్ను రమ్మన్నాడు. అందుకే ఆలశ్యమైంది. వాళ్ళింట్లోనే భోజనం చేసివచ్చాను. నువ్వెళ్ళి భోంచేయి. నాకు నిద్రవస్తోంది" వాసుదేవరావు చొక్కావిప్పి మంచంమీద పడుకున్నాడు. శాంత చెంపమీద చెళ్ళున చరచినట్లైంది. కండ్లనిండా నీళ్ళుతిరిగాయి. తనలాంటి అల్పక్రిమి ప్రపంచంలోనే లేదనిపించింది. నిన్నటి రంగనాథ నవ్వుచు హృదయంలో సూటిగా గుచ్చుకుంది శూలంలా. ఆబాధంతా అణచుకుంది అతిప్రయత్నంతో.

"మీరూరండి. ఊరికేకూర్చోండి అక్కడ." దీనంగా, దుఃఖపు పొరలు అడ్డంరాగా అంది శాంత.

"వద్దుశాంతా! అక్కడే గొంతువరకు తిన్నాను, బాగా నిద్రవస్తోంది.'' అంటూ అటువేపుతిరిగాడు. శాంతకు సర్రున కోపంవచ్చింది. ఎక్కడలేని అసహ్యం కలిగింది. కండ్లు అగ్నిగోళాలయ్యాయి. శరీరం నల్లత్రాచులా పడగవిప్పి, తోకమీద నుంచున్నట్లుగా బుసకొట్టింది. కాసేపునుంచుని - కదిలే శిలలా వంటింట్లోకిపోయి అన్నింటిమీదా మూతలుమూసి తలుపేసివచ్చింది.

వస్తూనే శాంత కొయ్యబారిపోయింది. వాసుదేవరావు సన్నగా గురకపెడు తున్నాడు. అతని తలప్రక్క తన మెత్త, శాంత విలవిలలాడింది. తలలోని మల్లె దండనుతీసి దూరంగా విసిరిపారేసింది. బయట రంగనాథం తలుపు తీస్తున్నశబ్దం. ఎవరో స్త్రీతో మాటాడుతున్న అలికిడి. ఆ తర్వాత రిక్షాక్రింద కాలిరికిన కుక్కపిల్ల కుయ్యోమనే అరుపు. అది తన గుండెకోసి గొంతుదాకావచ్చి ఆగిపోయిన ఆక్రం దనలావుంది. శాంత తలగడాతీసి కిందేసింది. లైటార్పింది. గది తనమనసులో చీకటినింపుకుంది. శాంత తలగడాచేరింది. రంగనాథం తలుపుమూస్తూ నవ్వాడు కిసుక్కున. శాంత కొంగును బలంగా నోట్లో గ్రుక్కుకుంది.